
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## సమర్థవంతంగా పోలింగ్ విధులు నిర్వహించాలి



**నెల్లూరు అర్బన్,ఫిబ్రవరి8,ప్రభాతవార్త** త్వరలో జరగనున్న 2024 సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై ఎన్నికల అధికారులు పూర్తి అవగాహన కలిగి సమర్థవంతంగా పోలింగ్ నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు.గురువారం ఉదయం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు రెండురోజుల పాటు నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొరపాటు జరిగిన తర్వాత సరిదిద్దుకోవడం కంటే ముందే పూర్తిగా అర్థంచేసుకుని పొరపాట్లను జరగకుండా చూడడమే ఎన్నికల పోలింగ్ విధుల్లో అతి ప్రమాదమైన బాధ్యతగా కలెక్టర్ చెప్పారు.రాజ్యాంగం ప్రసాదించిన ఓటుహక్కును అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా లోటుపాట్లు లేకుండా పోలింగ్ విధులకు సిద్ధం కావాలని ఎన్నికల అధికారులకు సూచించారు.ఈవీఎంల సీలింగ్ నుండి మాక్ పోలింగ్ వరకు గత ఎన్నికల కంటే ఇప్పుడు చాలా మార్పులు వచ్చాయని,వీటిని క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలన్నారు.నియోజకవర్గస్థాయి మాస్టర్ ట్రైనర్లు సరైన అవగాహన కలిగి ఉంటే కిందిస్థాయి ప్రిసైడింగ్ ఆఫీసర్లు,అసిస్టెంట్ ఆఫీసర్లు, సక్రమంగా అవగాహన కల్పించగలుగుతారని,లేకుంటే పూర్తిస్థాయిలో పోలింగ్ విధులు పట్ల అవగాహన కల్పించలేరన్నారు.దీన్ని దృష్టిలో పెట్టుకుని మాస్టర్ ట్రైనర్లు పూర్తిగా పోలింగ్ విధులను అర్థం చేసుకుని కిందిస్థాయి సిబ్బందికి తర్ఫీదు ఇవ్వాలన్నారు.అందరూ కూడా భారత ఎన్నికల సంఘం అందించిన హ్యాండ్ బుక్‌ను తప్పనిసరిగా చదివి అర్థం చేసుకోవాలన్నారు. ప్రతి ఎన్నిక కూడా కొత్తగానే ఉంటుందని భావించి పోలింగ్ ప్రక్రియను సజావుగా,ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్,డిఆర్వో లవన్న,ఎన్నికల రిటర్నింగ్ అధికారులు వికాస్,విద్యాధరి,మధులత,మలోల,శీనానాయక్,ప్రేమ్‌కుమార్,నోడల్ అధికారులు కన్నమనాయుడు, సాంబశివారెడ్డి, చందర్,సుస్మిత,సదారావు,తిరుపతయ్య పాల్గొన్నారు.

## సియం పర్సనల్ కార్యదర్శిని కలిసిన మాజీ ఎమ్మెల్యే వంటేరు



**కావలి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్సనల్ కార్యదర్శి ధనుంజయరెడ్డికి కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాలరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. అనంతరం ధనుంజయరెడ్డితో వంటేరు ముచ్చటించారు. ఉదయగిరి నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా అవకాశం ఇస్తే పోటీ చేసేందుకు సిద్దంగా వున్నానని వంటేరు తెలిపారు. వైసిపి పార్టీ అభివృద్ధికి ఎంతగానో పనిచేశానని అయినా తనకు గుర్తింపు దక్కడం లేదని తెలిపారు. 2014 ఎన్నికలలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసం ఎంతో కృషి చేశానని ధనుంజయరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఫలితం లేదన్నారు. 2019 ఎన్నికలలో ఉదయగిరిలో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేసినట్లు తెలిపారు. తనకు ఎన్నోసార్లు ఎన్నో విధాలుగా హామీలు ఇచ్చారని నెరవేర్చలేదని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత కల్పించి ఎమ్మెల్సీ పదవులు, కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చారని గుర్తు చేశారు. దీంతో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ధనుంజయరెడ్డి హామీ ఇచ్చారు. ఉదయగిరి నియోజకవర్గానికి పోటీ చేసేందుకు సంసిద్దతను వంటేరు వ్యక్తం చేశారు.

## సర్వాంగ సుందరంగా పార్కు



**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని మాగుంట లేఅవుట్‌లోని అన్నమయ్య సర్కిల్ సమీపంలో ఉన్న నుడా పార్కును, నెల్లూరు పార్లమెంటు సభ్యులు, రూరల్ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు గురువారం నెల్లూరు విజయ డైరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారకా నాథ్‌లు సందర్శించారు. ఈ నెలలోనే ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించనున్న ఈ నుడా పార్కులో అన్ని విధాలుగా అధునాతన వసతులు ఏర్పాటు దిశగా శరవేగంగా పనులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయ డైరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారకా నాథ్‌లు పార్కును సందర్శించి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ సీహెచ్ హరిబాబు యాదవ్, జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి వేలూరు శివ సునీల్‌రెడ్డి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ ఏసు నాయుడు, నెల్లూరు నగర వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు సన్నపరెడ్డి పెంచలరెడ్డి, ఉపాధ్యక్షులు వేలూరు శ్రీధర్‌రెడ్డి, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## కావలిలో 23 మంది ఆశా వర్కర్లు అరెస్ట్

**కావలి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త** చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న 23 మంది ఆశా వర్కర్లను కావలి రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు గౌడ్ అరెస్ట్ చేశారు. నెల్లూరు, గూడూరు నుంచి బస్సులలో వెళ్తున్న వారిని అరెస్ట్ చేసి రూరల్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. రూరల్ స్టేషన్ ప్రాంగణంలో ఆశా వర్కర్లు నిరసనలు వ్యక్తం చేశారు.నినాదాలతో హోరెత్తించారు. గురువారం వారిని విడుదల చేశారు. ఆశా వర్కర్లకు మద్దతుగా సిపియం నేతలు పాల్గొన్నారు.

## అంకెల గారడీకే పరిమితమైన వైసీపీ బడ్జెట్



**నెలూ్లరు,ఫిబ్రవరి8 ప్రభాతవార్త- వైద్యం** వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా అంకెల గారడీకే పరిమితం అయిందని, బుగ్గన బడ్జెట్ అంచనాలేమో కొండంత ఖర్చు పిసరంతని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌అజీజ్ విమర్శించాడు. గురువారం నగరంలోని 51వ డివిజనులో బాబుష్యూరిటీ-భవిష్యత్తుగ్యారెంటీ కార్యక్రమంలో అజీజ్ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ అభివృద్ధి పథకాల కరపత్రాలను అందిస్త ప్రచారం చేశాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.13వేలకోట్ల రెవెన్యూ లోటును రూ.44వేలకోట్లకు, రూ.35వేలకోట్ల ద్రవ్య ఓటును రూ.66వేలకోట్లకు పెంచిన ఘనత బుగ్గనదేనని ఏద్దేవా చేశాడు. పన్నులబాదుడు తప్ప బడ్జెట్లో కొత్త అంశాలు ఏమీ లేవన్నాడు. ఆంధ్రప్రదేశ్‌ని అప్పులప్రదేశ్‌గా మార్చేసిన ఘనుడు జగన్ అని మండిపడ్డాడు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేసుకుంటే ఈ రాష్ట్రం భవిష్యత్తుని కాపాడుకోగలమన్నాడు. మీదూరి ప్రశాంత్‌కుమార్, కమతం ప్రశాంత్‌కుమార్, బాలా, కుమార్ మంగళం, జానా వాసు, ఎంబెటి సందేశ్, వాదనాల నరేష్, బండి ప్రవీణ్‌కుమార్, అశోక్ పాల్గొన్నారు.

## చుక్కల భూములు,అసైన్మెంట్ భూముల పంపిణీపై ప్రత్యేక దృష్టి



**నెల్లూరు అర్బన్,ఫిబ్రవరి8,ప్రభాతవార్త** జిల్లాలో చుక్కల భూములు,అసైన్మెంట్ భూములు కేటాయింపు,రీసర్వే మొదలైన రెవెన్యూ అంశాలపట్ల ప్రత్యేక దృష్టి సారించాలని,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.గురువారం మధ్యాహ్నం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి సంబంధిత కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో అమరావతి నుండి వర్చుల్‌గా సమావేశమై చుక్కల భూములు,అసైన్మెంట్ భూముల పంపిణీ,రీసర్వే,జగనన్న ఇళ్ల నిర్మాణాలు,పోలింగ్ కేంద్రాల్లో వసతులకల్పన తదితర అంశాల పురోగతి,చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు నెల్లూరు కలెక్టరేట్ నుండి జిల్లా హరినారాయణన్,జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్,వివిధ శాఖల అధికారులు హాజరైయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలో చుక్కల భూములు,అసైన్మెంట్ భూములుపంపిణీపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పూర్తి చేయాలన్నారు.రీ సర్వే ప్రక్రియపై జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని లోపాలను సరిచేసి పనులను వేగవంతం చేయాలన్నారు.అసైన్ భూములకు సంబంధించి పెండింగ్ ఉన్న వాటిని త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.నవరత్నాలు,పేదలందరికీ ఇళ్ల నిర్మాణాలపై పొదుపు సంఘాల్లోని మహిళలకు 35వేల అదనపురణాన్ని మంజూరు చేసి ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచుకోవాలన్నారు.2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని,మౌలిక వసతులు వెంటనే కల్పించాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పరిశ్రమల శాఖ జిఎం సుధాకర్,డ్వామా పీడి వెంకట్రావు,సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎడి హనుమాన్ ప్రసాద్,డిఎంహెచ్వో పెంచలయ్య,ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్,అర్డబ్ల్యూఎస్ ఎస్ఈ రంగవల ప్రసాద్,హౌసింగ్ పీడీ తదితరులు పాల్గొన్నారు.

## జాయింట్ కలెక్టర్‌ని కలిసిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



**నెల్లూరు ఫిబ్రవరి 8 ప్రభాతవార్త** జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆదర్ష్ రాజేంద్రన్ ఐఎఎస్ వారిని మర్యాదపూర్వకంగా కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కలిశారు. వారికి పుష్పగుచ్ఛం అందజేశారు. డిసిఎంఎస్ ఛైర్మన్ వీరి చలపతిరావు, రాష్ట్ర వ్యవసాయ సలహామండలి సభ్యులు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఎఎంసి ఛైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, వైఎస్ఆర్ సిపి నాయకులు కలువబాల శంకర్‌రెడ్డి ఉన్నారు.

# కంటైనర్ టర్మినల్‌ను తరలిస్తే ఊరుకునేది లేదు



**ముత్తుకూరు, ఫిబ్రవరి8,ప్రభాతవార్త** ఆదానీ కృష్ణపట్నం పోర్టులోని కంటైరన్ టర్మినల్ కార్యకలపాలు యదావిధిగా కొనసాగించాలని అఖిలపక్షంతో కలిసి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదాని పట్నం పోర్టు సీఈవో జిజె రావుకు వినతిపత్రం అందజేశారు.అనంతమం మీడియాతో సోమిరెడ్డి మాట్లాడుతూ కంటైనర్ టర్మినల్‌ను తమిళనాడుకు తరలించడం సమంజసం కాదన్నారు.కృష్ణపట్నం ఆధారిత పోర్టుపరిశ్రమల కోసం 16వేల ఎకరాలతో సెజ్‌లు ఏర్పాటు చేశారని,అవన్నీ ఈరోజున పక్కనపెట్టి భూములు ఇచ్చిన రైతుల త్యాగాలకు ఫలితం లేకుండా పోయిందన్నారు.2014-2019మధ్య కాలంలో అధికారపార్టీ నేతలుగా ఏరోజూ పోర్టులో అడుగుపెట్టలేదన్నారు.కంటైనర్ టర్మినల్లో ఐరన్‌ఓర్ డంప్ చేస్తున్నారన్నారు.తమిళనాడు ప్రజలు తిరస్కరిస్తే డట్టీ కార్గోను పోర్టుకు పరిమితం చేయడం దుర్మార్గపు చర్య అన్నారు.రాజకీయ వైవిద్యాలన్నీ పక్కనపెట్టి కృష్ణపట్నం పోర్టుకు కాపాడుకునే విధంగా ముందుకు వెళ్తున్నామన్నారు.కృష్ణపట్నం కంటైనర్ టర్మినల్ ఇక్కడే పునరుద్ధరించకుంటే అఖిలపక్షాలు అన్ని కలిసి ఆందోళన చేయడానికి సిద్ధంగా ఉన్నామని,ఇప్పటికే 10వేల మంది రోడ్డున పడ్డారని ఆయన అన్నారు.అధికారపార్టీ నేతలు ఇంత అన్యాయం జరుగుతుంటే వారికి కనిపించడంలేదా అని సూటిగా విమర్శలు కురిపించారు.అనంతరం జిల్లా పార్టీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ కోస్తా,రాయలసీమ,కర్ణాటకకు సంబంధించిన కంటైనర్ ట్రాన్స్‌పోర్టు కృష్ణపట్నం పోర్టు ద్వారా జరిగేదని,కృష్ణపట్నం పోర్టు ప్రైవేటుదని,ప్రభుత్వం రంగం ఈ పోర్టును లీజుకు మాత్రమే ఉందన్నారు.ఏమైనా అఖిలపక్షంతో కలుసుకని కంటైనర్ టర్మినల్ తరలిపోకుండా అడ్డుకుంటామని,ఉద్యోగులకు,స్థానికులకు అన్యాయం జరగకుండా చూస్తామన్నారు.ఈ కార్యక్రమంలో వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ,గూడూరు మాజీ ఎమ్మెల్యే పి.సునీల్‌కుమాం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి,బిజెపి జిల్లా అధ్యక్షులు వంశీధర్‌రెడ్డి,ఏఐటియుసి జిల్లా కార్యదర్శి పి.రవిశంకర్,జనసేన సర్వేపల్లి ఇన్‌ఛార్జి బొబ్బేపల్లి సురేష్,రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర,మండలపార్టీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి,రమణయ్య,కోదండరామయ్య,మునిరెడ్డి, మల్లికార్జునయాదవ్,అక్కయ్యగారి ఏడుకొండలు, సిపిఐ మండల కార్యదర్శి తుంగా ఏడకొండలు,మండల నాయకులు పాల్గొన్నారు.

# కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా మెరుగైన పౌరసేవలు



**నెల్లూరు కార్పొరేషన్,ఫిబ్రవరి8, ప్రభాతవార్త** నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ విభాగాన్ని మేయర్ స్రవంతి జయవర్ధన్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కంట్రోల్ సెంటర్లోని వివిధ విభాగాలను పరిశీలించి,వాటి పనితీరును పరిశీలించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అతిపెద్ద కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని నెల్లూరునగరపాలక సంస్థ ప్రాంగణంలో 8.5కోట్లతో నిర్మించడం జరిగిందన్నారు.నూతన కమాండ్ కంట్రోల్ రూమ్ సెంటర్ ఏర్పాటుతో ప్రజల వద్ద నుండి పత్రికలు,ఎలక్ట్రానిక్ మీడియా,సోషల్ మీడియా ద్వారా వచ్చే ఫిర్యాదులను నిర్ణిత సమయంలో పరిష్కరించి వాటిని మానిటరింగ్ చేయడం జరిగుతుంది.నగర వ్యాప్తంగా మెరుగైన పారిశుధ్య సేవలు అందించడం సాధ్యమవుతుందని, పారిశుధ్య నిర్వహణ పనులను నిరంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచే పర్యవేక్షించే సాంకేతికతను కమాండ్ కంట్రోల్ సెంటర్లో ఏర్పాటు చేశారని తెలిపారు.అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నగరవ్యాప్తంగా, స్పందన పరిష్కార వేదిక,ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ఎక్కడైనా పెండింగ్‌లో ఉన్నవి కూడా ఇక్కడ నుండి మోనిటరింగ్ చేయడం జరుగుతుంది,నగర పాలక సంస్థ సమగ్ర సమాచార విభాగం వంటి వివిధ విధులను నిర్వహించాలన్నారు. సమస్యలకు 18004251113,14420 టోల్‌ఫ్రీ నెంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని, వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 41వ డివిజన్ కార్పొరేటర్ కువ్వకోలు విజయలక్ష్మి,35వ డివిజన్ కార్పొరేటర్ యాకసిరి వాసంతి,కొ-ఆప్షన్ సభ్యులు మొబీన,నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలోని ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ మాత్ర వేయాలి



**నెల్లూరు టౌన్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు తప్పనిసరిగా నులి పురుగులు నివారణ ఆల్బెండజోల్ మాత్ర వేయాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరక్టర్ బి.హేనసుజన్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ శుక్రవారం జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం సందర్భంగా చైల్డ్ డవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తమ పరిధిలోని ప్రాజెక్టుల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు అందరికి నూరు శాతం నులిపురుగుల నివారణ మాత్రలు వేసి విజయవంతం చేయాలని కోరారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తమ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు ముందస్తు సమాచారం అందించి తద్వారా పిల్లల తల్లిదండ్రులకు సమాచారం అందించి వాఇ సహకారాన్ని కూడా తీసుకొని పిల్లలకు డి వార్మింగ్ మాత్రలు మింగించాలని సూచించారు. పిల్లలకు కడుపులో నులి పురుగులు ఉన్నట్లయితే రక్తహీనత కలిగి ఉండటంతో పాటు పోషకాహారం లోపం వలన నీరసంగా ఉంటారని, తద్వారా మానసిక, శారీరక ఎదుగుదల లోపాలను కలిగి ఉంటారని పేర్కొన్నారు. తద్వారా మానసిక, శారీరక ఎదుగుదల లోపాలను కలిగి ఉంటారని పేర్కొన్నారు. ఆల్బెండజోల్ మాత్రను చిన్నారులకు మింగించడం వల్ల నులి పురుగుల సంక్రమణ సులభంగా నిర్మూలించవచ్చని ఆమె స్పష్టం చేశారు.

చేతి వేళ్ళ గోళ్లను శుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రమైన నీటిని తీసుకోవాలని, ఆహార పదార్థాలను కప్పి ఉంచాలని, కూరగాయలు, పళ్ళు తదితర ఆహార పదార్థాలను మంచినీటితో శుభ్రం చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బయట తిరిగేటప్పుడు తప్పనిసరిగా చెప్పులు లేదా బూట్లు వేసుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయరాదని ఎప్పటికప్పుడు చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వివరించారు. ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా వేయాలని సూచించారు.

# జనసేనాని అదేశిస్తే ఎక్కడినుండైనా పోటీకి సిద్ధం



**నెలూ్లరు,ఫిబ్రవరి8 ప్రభాతవార్త-విద్య** తమపార్టీ అదినేత పవన్‌కళ్యాణ్ ఆదేశిస్తే రానున్న ఎన్నికల్లో జిల్లాలోని ఏ అసెంబ్లీ స్థానం నుండైనా పోటీ చేసేందుకు తాను సిద్దంగా ఉన్నాని జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన నృత్యదర్శకులు జానీ మాస్టర్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని స్థానిక యష్‌పార్క్‌లో ఆయన మీట్‌ది ప్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జానీ మాస్టర్ మాట్లాడుతు తమ అధినేత ఆశయాలు నచ్చి ఆయన బాటలోనే ప్రజలకు సేవ చెయ్యాలనే ఉద్దేశ్యంలో విలాసవంతమైన జీవితాన్ని వదిలి రాజకీయక్షేత్రంలోకి రావటం జరిగిందన్నారు. జిల్లాలో తమ పార్టీ ఎంతో భలంగా ఉందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో క్రీయాశీలకంగా పనిచేస్తున్నారన్నారు. వారందరి సహకారంతో తానుకూడా పార్టీ అభివృద్ధికి తోడ్పాటు అందించటం జరుగుతుందని తెలిపారు. పేదల సొంత ఇంటికలను నెరవేర్చేందుకు గత ప్రభుత్వం జిల్లాలో వేల సంఖ్యలో గ్రేటెట్ కమ్యూనిటీ తరహాలో టిడ్కో ఇండ్లను నిర్మించిందని గుర్తుచేశారు. తరువాత అధికారంలోని వచ్చిన వైకాపా ప్రభుత్వం పేదల సొంత ఇంటి కలను విచ్చినం చేసిందని, నూతన గృహాలను నిర్మించకపోగా ఎప్పుడో పూర్తి అయిన ఇండ్లను కూడా ప్రజలకు అందించలేదన్నారు. దీని ఫలితంగా ఆ ఇండ్లు ఆలనా పాలనా లేక దొంగలకు నివాసాలుగా మారిపోయాయని, వాటిలోని టైల్స్, ఫ్యాన్స్, బాత్‌రూమ్ సామానులు దొంగతనాలకు గురైయ్యాయని ఆరోపించారు. వీటిని పట్టించుకోని జగన్ ప్రభుత్వం ఇండ్లకు మరమ్మత్తులు చేపట్టకపోగా రంగులు మార్చే నెపంతో కోట్లరూపాయల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిందని దుయ్యబట్టారు. తెలుగుదేశం హయాంలో నిర్మించిన ఇండ్లకు వైకాపా రగులువేసి వారే నిర్మించినట్లు చిత్రీకరించేందుకు చర్యలు తీసుకోవటం సిగ్గుచేటన్నారు. పేదల సొంత ఇంటి కలను విచ్చినం చేస్తున్న వైకాపా నిరంకుశ పాలనకు వ్యతిరేఖంగా టిడ్కో గృహాలను తక్షణం లబ్ది దారులకు మంజూరు చెయ్యాలకి డిమాండ్ చేస్తూ ఈనెల10 తేదీన సుమారు 1000మంఇ లబ్దిదారులతో మహా ధర్నాలు చేపట్టనున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈ ఉద్యమాన్ని ఉధృతం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళణలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, చిరంజీవి యువత రాష్ట్రనాయకులు కారంపూడి కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షులు ఈగ సురేష్, నాయకులు ప్రశాంత్, గుడి హరిరెడ్డి, వీర మహిళా నాయకురాలు నాగరత్నం,ఆశిక్, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ప్రాక్టికల్స్‌ను పక్కాగా నిర్వహించండి




**నెల్లూరు,ఫిబ్రవరి8 ప్రభాతవార్త-విద్య** జిల్లాలో ఈనెల 11నుండి ప్రారంభం కానున్న ఇంటర్ ప్రాక్టికల్స్‌ను పక్కాగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.లవన్న పేర్కొన్నారు. గురువారం నగరంలోని స్థానిక డికె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లాలోని కళాశాలల ప్రిన్సిపాల్స్, చీఫ్ సూపరింటెండెట్లు, ప్రాక్టికల్స్ ఎగ్జామినర్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణ ఆదేశాల మేరకు అన్నీ శాఖలను సమన్వయం చేసుకుని ఏర్పాట్లు పూర్తిచేయటం జరిగిందన్నారు. అలాగే వచ్చే మూడు రోజుల్లో జిల్లాలోని పరీక్షా కేంద్రాలను కూడా పరిశీలించనున్నామని పేర్కొన్నారు. నిభందలను పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి డాక్టర్ ఏ.శ్రీనివాసులు మాట్లాడుతు గతంలో జరిగిన సంఘటనలను పునరావృత్తం కాకుండా పరీక్షలకు సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్నీ చర్యలు తీసుకోవటం జరిగిందని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలను ఏర్పాటుచేశామని, వీటిని నేరుగా ఇంటర్‌బోర్డుకు అనుసంధానం చేయటం జరిగిందన్నారు. పూర్తి పారదర్శకతతో ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నామని నిభందలను పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి మధుబాబు, డిఈసీ సభ్యులు ఆదినారాయణరావు, పి.వేణుగోపాల్, కొండయ్య, బి.దీనదయాల్,తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి మాజీ కన్వీనర్ చింతం బాబుల్‌రెడ్డి టిడిపిలో చేరిక



**కావలి,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండల వైసిపి మాజీ కన్వీనర్, గౌరవరం గ్రామ ముఖ్యనేత చింతం బాబుల్‌రెడ్డి గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కావ్య కృష్ణారెడ్డి నివాసంలో బాబుల్‌రెడ్డి ఆయన సహచరులకు కావ్య టిడిపి కండువలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. బాబుల్‌రెడ్డి సతీమణి కేంద్ర సహకార బ్యాంక్ డైరెక్టర్ తిరుమలరాణి, గౌరవరం ఎంపిటిసి రమణమ్మలు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తానని తెలిపారు. తాను టిడిపి ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒక మాజీ సైనికుడు బాబుల్‌రెడ్డి పార్టీలోకి రావడం ఎంతో ఆనందంగా వుందన్నారు. ఈ చేరికలు ఎన్నికల రోజు వరకు కొనసాగుతాయన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కావలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందన్నారు.

## చెన్నూరురోడ్డులో విద్యుత్ స్తంబాలు మార్పు

**బుచ్చి ఫిబ్రవరి 8 ప్రభాతవార్త** : బుచ్చిరెడ్డిపాళెం చెన్నూరురోడ్డులో శుక్రవారం కరెంట్ పోల్స్ మారుస్తునట్లు చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ తెలిపారు.మద్యహ్నాం 2 గంటల నుండి సాయింత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

## దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



**బుచ్చి ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీ పరిధిలోని దోమలు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా తెలిపారు.ఈ సందర్భంగా కమీషనర్ రమణరావుతో కలిసి గురువారం దోమల మందును పిచికారి చేసే ప్రత్యేక వాహనాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మాట్లాడుతు నగరంలో దోమల నివారణకు,కాలువలలో దోమల మందును పిచికారి చేయనున్నట్లు ఆమె తెలిపారు. ప్రజలు కూడా బాగస్వాములై పరిశరాల పరిశుభ్రతను పాటించాలని అన్నారు. హెల్త్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు కమీషనర్ ఆద్వర్యంలో తిరిగి ప్రతి వారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం పునః ప్రారంభించాలని ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో కమీషనర్ రమణబాబు, మున్సిఫల్ వార్డు ఇన్‌చార్జ్‌లు ఆనంద్ బాల సుబ్రహ్మణ్యం, ప్రసాద్,శ్రీదర్, సునీల్,శ్రీనయ్య, అనీల్ తదితరులు పాల్గోన్నారు.

## పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయండి



**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** అమరావతిలో గురువారం అసెంబ్లీ ఆవరణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర వైసీపీ సేవాదళ్ అధ్యక్షులు మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా జగన‌మోహన్‌రెడ్డి ఆప్యాయంగా పలకరిస్తూ రాబోయే ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేయాలన్నారు. నెల్లూరు జిల్లా రాజకీయాలలో మరింత చురుగ్గా కష్టపడి మెజార్టీ స్థానాలలో విజయం సాధించేలా కృషి చేయాలని తెలిపారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహశీల్దార్



**సైదాపురం, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రామసాగరం, సైదాపురం, చాగణం, మర్లపూడి గ్రామ సచివాలయాల పరిధిలో ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ టి.ప్రవీణ్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసే వసతులను, విద్యుత్ సరఫరా, వికలాంగులకు ప్రత్యేక వసతులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడతూ మండలంలో 49 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి కేంద్రంలో ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ నారాయణ, వీఆర్వోలు సుబ్బయ్య, హజరత్తయ్య తదితరులు ఉన్నారు.

## కులవివక్ష చూపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



**వింజమూరు ,ఫిబ్రవరి8,ప్రభాతవార్త :** వింజమూరు మండలం కాటేపల్లి పంచాయతీలోని మాధవనగర్‌లో నీడ స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్న మినరల్ వాటర్‌ప్లాంట్‌నిర్మాణాన్ని అడ్డుకుంటూ మాదిగల పట్ల వివక్ష చూపుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం ఎంఎస్‌పి జిల్లా నాయకులు అంబేద్కర్ మాదిగ స్థానిక తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాధవనగర్‌లోని మాదిగల పట్ల కొంతమంది ఉద్దేశపూర్వకంగా కులవివక్ష చూపుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నా రన్నారు. గ్రామంలో ఫ్లోరిన్‌కారణంగా ఏర్పాటు చేస్తున్న వాటర్‌ప్లాంట్ ను అడ్డుకోవడం కులవివక్షే నన్నారు. గ్రామంలో కొందరు కులంపేరుతో దూషిస్తూ అడుగడుగునా అడ్డుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా, మండల స్థాయి అధికారులు గ్రామాన్ని సందర్శించి వివక్ష చూపుతున్నవారిపట్ల చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల ఎంఎస్‌పి అధ్యక్షుడు గోచిపాతల ఆనంద్, నాయకులు మలబంటి సుధాకర్, మాధవ, శ్రీను, రామయ్య, నాగయ్య, మాల్యాద్రి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## జన హృదయనేత తనయుడు జగన్



**వింజమూరు,ఫిబ్రవరి8,ప్రభాతవార్త :** కాంగ్రెస్‌పార్టీని రెండుసార్లు అధికారంలోకి తెచ్చి ప్రజల హృదయాల్లో జనహృదయ నేతగా నిలిచిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనయుడు , ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తండ్రి చూపిన మార్గాన్ని అనుసరిస్తూ పాలన చేస్తున్న మహానేత అని ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన యాత్ర-2 సినిమా రిలీజ్ సందర్భంగా వింజమూరులోని సూర్య థియేటర్‌లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలసి తిలకించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీవిత జ్ఞాపకాలను గుర్తుచేస్తూ దర్శకుడు అద్భుతంగా సినిమాను తెరకెక్కించారన్నారు. వైఎస్ఆర్ మరణానంతరం వైఎస్ కుటుంబం ఎదుర్కొంటున్న కష్టాలను ప్రేక్షకులకు అద్భుతంగా చూపాడన్నారు. వింజమూరులో వారం రోజులపాటు యాత్ర-2 సినిమా ఉచితంగా ప్రదర్శించబడుతుందని నియోజకవర్గ పరిధిలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తిలకించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో మేకపాటి అభినవరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## అనారోగ్య బాధితులకు కాకర్ల ఆర్థికసాయం



**వింజమూరు,ఫిబ్రవరి8,ప్రభాతవార్త :** వింజమూరు మండలం కాటేపల్లి పంచాయతీ పరిధిలోని తమిదపాడుకు చెందిన తెలుగుదేశంపార్టీ నాయకులు డబ్బుగొట్టు వెంగయ్య, వెంకటేశ్వర్లు రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి అనారోగ్యంతో ఉండడంతో గురువారం కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ కాకర్ల సురేష్ వెంగయ్య, వెంకటేశ్వర్లుకు వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ మెంబర్లు పాల్గొన్నారు. కొండాపురం మండలం సాయిపేటకు చెందిన పెద్ద కత్తుల శీనుకు వైద్య ఖర్చులకు ఆర్థికసాయం అందజేశారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## అరుంధతీయులకు కమ్యూనిటీ హాలును నిర్మిస్తా



**కావలి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** రానున్న ఎన్నికలలో తాను ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం అరుంధతీయులకు కమ్యూనిటీ హాలు నిర్మిస్తానని తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కావ్య కృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. గురువారం పట్టణంలోని అరుంధతీయపాళెం నుండి పెద్దఎత్తున మహిళలు తప్పెట్ల, తాళాలతో ముసునూరు టిడిపి కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. టిడిపి నేత కావ్య కృష్ణారెడ్డిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కావ్య కృష్ణారెడ్డి మాట్లాడారు. అరుంధతీయుల ఆరాధ్య దైవం మాతమ్మ అంటే ఇష్టమన్నారు. ఇటీవల ఉత్సవానికి వచ్చి మాతమ్మను దర్శించుకోవడం జరిగిందన్నారు. బాబు జగజ్జీవన్‌రామ్ స్మృతివనానికి కృషి చేస్తానన్నారు. తాను కూడా పేదరికం నుండి వచ్చిన వాడినని ప్రజల కష్టాలు తెలుసునన్నారు. ఏ కష్టం వచ్చినా అండగా వుంటానన్నారు. రానున్న ఎన్నికలలో ఎమ్మెల్యేగా గెలిపించాలని, ఆశీర్వదించేందుకు వచ్చిన మీ అందరికి రుణపడి వుంటానన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మా రామారావు, బొమ్మా జానకి, పులి శ్రీను, పులి జయంతి, దావులూరి తిరుపతమ్మ, వసంతకుమార్, కత్తి విజయ్, తదితరులు పాల్గొని విజయం కృష్ణారెడ్డికి వరిస్తుందని తెలిపారు.

## వివాద స్థలాన్ని పరిశీలించిన తహశీల్దార్ కె.రవిబాబు



**ఉలవపాడు,ఫిబ్రవరి8,ప్రభాతవార్త :** ఉలవపాడు మండలం కరేడు పంచాయతీలోని పరిధిలో ఆదిఆంధ్రకాలనీ వాసులు ఎవరైనా మరణిస్తే కర్మకాండలు నిర్వహించుటకు పోవు డొంకను ఒక సామాజిక వర్గంఅక్రమించిందని,ఆ కాలనీ వాసులు ఆరోపించారు.ఆ వివాద స్థలాన్ని పరిశీలించుటకు ఉలవపాడు తహశీల్దార్ కె.రవిబాబు,సర్వేయర్ శ్రీనివాసరావుతో వెళ్లి ఆ వివాద స్థలాన్ని గురువారం పరిశీలించారు.అనంతరం ఇరువర్గాల పెద్దలను పిలిచి వివాదం లేకుండా రాజీ చేసుకోవాలని ఆయన ఇరువర్గాల పెద్దలకు తెలియజేశారు.

## స్కూల్‌ను పరిశీలించిన తహశీల్దార్



**ఉలవపాడు,ఫిబ్రవరి8,ప్రభాతవార్త :** ఉలవపాడు మండలం కరేడు పంచాయతీ పరిధిలోని పలు స్కూల్స్‌ను గురువారం తహశీల్దార్ కె.రవిబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కరేడు పరిధిలోని టెంకాయచెట్ల పాలెం అంగన్వాడీ కేంద్రాన్ని,అలగాయపాలెంలోని ప్రాధిమికోన్నత పాఠశాల ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు.విద్యార్థుల సామర్థ్యం పరీక్షించారు.విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజన పథకం నాణ్యతగా ఉండాలని నిర్వహకులకు సూచించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రతిరోజు భోజనం తనిఖీ చేయాలన్నారు.విద్యార్థులను మెరుగుపరిచే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని ఆయన సూచించారు.

## రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన



**బుచ్చి ఫిబ్రవరి 8ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలో జొన్నవాడ రోడ్డు సెంటర్ సెంటర్ మోటార్‌వెహికల్ ఇనస్పెక్టర్లు రోడ్డు భద్రతపై రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించి వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇనస్పెక్టర్ స్వప్నల్‌రెడ్డి,రఘవర్ధన్‌రెడ్డి ,డాక్టర్ స్వరూపారాణి వాహనదారులకు అవగాహన కల్పించారు.ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని వారు సూచించారు. ప్రమాదవశాత్తు రోడ్డుపైన పడివున్న వారికి సహాయం అందించాలని ,అటువంటి వారి పేరు గోప్యంగా ఉంచడం జరుగుతుందని అన్నారు. అలాగే జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా వారికి ప్రశంసాపత్రం అందచేస్తామని,వారికి 5 వేలు పారితోషకం కూడా ఇస్తామని చెప్పారు. పోలీసులతో ఎటువంటి ఇబ్బంది ఉండదని అన్నారు. ప్రజలు అవగాహనతో మెలగాలని రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.ఈకార్యక్రమంలో వాహనదారులు తదితరులు పాల్గోన్నారు.

## మాదిగల యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయండి



**నెల్లూరు టౌన్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** ఈనెల 10వ తేదీ శనివారం నెల్లూరు నర్తకి సెంటర్లో జరిగే మాదిగల యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక వర్కింగ్ ప్రెసిడెంట్ పందిటి సుబ్బయ్య పిలుపునిచ్చారు. నెల్లూరు నగరంలోని అంబేద్కర్ భవనంలో గురువారం సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే దిశగా తాము ఈ యుద్ధభేరిని నిర్వహిస్తున్నామని అన్నారు. గతంలో గూడూరు నుంచి పత్ర ప్రకాష్‌రావుకు మాత్రమే ఎమ్మె ల్యేగా అవకాశం కల్పించారని ఆ తర్వాత ఇప్పటి వరకు మాదిగలకు ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ గాని కనీసం రాజకీయ నామినేటెడ్ పదవుల్లో గాని ప్రాధాన్యత కల్పించిన దాఖలాలు లేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే పార్టీకి మాదిగల మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవిని మాదిగ వర్గానికి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సుమారు నాలుగు లక్షల మంది పైచిలుకు మాదిగలు ఉన్నప్పటికి ఆ దిశగా తమకు రాజకీయ ప్రాధాన్యత కల్పించకపోవడం అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 10వ తేదీ జరిగే మాదిగల యుద్ధభేరికి జిల్లా నలుమూలల నుంచి ప్రతి ఇంటి నుంచి కనీసం ఒక్కరైనా కదిలి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు నెల్లూరు నగరంలోని ఏబీఎం కాంపౌండ్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి నర్తకి సెంటర్‌కు చేరుకొని అక్కడ బహిరంగ సభ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో వెంకటరావు, కడుముల సుబ్బారావు, సాల్మన్, చిన్నయ్య, రియాజ్, హరి, రాజు, అలీ తదితరులు పాల్గొన్నారు.

## కావలి నియోజకవర్గ అభివృద్ధే తమ లక్ష్యం



**కావలి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** కావలి నియోజకవర్గ అభివృద్ధే తమ లక్ష్యమని, కావలి పట్టణాన్ని కనకపట్నంగా మారుస్తామని రానున్న ఎన్నికలలో పసుపులేటి సుధాకర్‌కు అవకాశం కల్పించాలని పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పసుపులేటి సుధాకర్ సతీమణి సుగుణమ్మ తెలిపారు. గురువారం కావలి పట్టణ 2వ వార్డులో సుధాకరన్న మాట...ఇంటింటికి సుగుణమ్మ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. 2వ వార్డులోని ఇస్లాంపేటలో ప్రజలు సుగుణమ్మకు స్వాగతం పలికి సత్కరించారు. ఇంటింటికి సుగుణమ్మ వెళ్లి చేసిన అభివృద్ధి కార్యక్రమాన్ని వివరించారు. కావలి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిస్వార్ధంగా సామాజిక సేవా కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నామన్నారు. గ్రామగ్రామాన అభివృద్ధి చేపడుతూ ముందుకు వెళ్తున్నామన్నారు. కావలి నియోజకవర్గ ప్రజలు తమకు పట్టం కట్టాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## గౌరవరం వైసిపి ఉపసర్పంచ్ శ్రీలత టిడిపిలో చేరిక



**కావలి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం గౌరవరం గ్రామ వైసిపి ఉపసర్పంచ్ సూరే శ్రీలత, ఆమె భర్త హరిశ్చంద్రారెడ్డిలు తెలుగుదేశం పార్టీలో చేరారు. గురువారం కావలి ముసునూరులోని టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కావ్య కృష్ణారెడ్డి నివాసంలో వారు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వారికి టిడిపి కండువలు కప్పి పార్టీలోకి కావ్య స్వాగతం పలికారు.గౌరవరం నుంచి వైసిపి పార్టీకి చెందిన ప్రముఖులు టిడిపి పార్టీలో చేరడం ఎంతో ఆనందంగా వుందన్నారు. అందరికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని కావ్య హామీ ఇచ్చారు.

## తిరుపతి జిల్లా మైనార్టీ కార్యదర్శిగా డాక్టర్ ఖాదర్‌భాషా

**రాపూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** తిరుపతి జిల్లా ముస్లిం మైనార్టీవిభాగం కార్యదర్శిగా వెంకటగిరి నియోజకవర్గ మండల కేంద్రమైన రాపూరు పట్టణానికి చెందిన డాక్టర్ షేక్ ఖాదర్ భాషను అధిష్టానం నియమించారు. తిరుపతి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం సమావేశం తిరుపతి పట్టణంలో గురువారం జరిగింది. ఈ సమావేశానికి తిరుపతి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ రసూల్, స్టేట్‌మైనార్టీ సెల్ కోఆర్డినేటర్ సీడ్ షఫీ అహ్మద్ ఖాదరి హాజరయ్యారు. సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ప్రధాన కార్యదర్శులను నియమించారు. వెంకటగిరి నియోజకవర్గం నుండి తిరుపతి జిల్లా మైనార్టీ విభాగం కార్యదర్శిగా డాక్టర్ ఖాదర్ భాషాను నియమిస్తున్నట్లు ధృవీకరణ పత్రాన్ని అందజేశారు. డాక్టర్ ఖాదర్ భాషా రాపూరు మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ బత్తిన పట్టాభి రామిరెడ్డికి ముఖ్యులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్యూనిటీ దవలప్‌మెంట్ చైర్ పర్సన్, వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి సూచనల మేరకు డాక్టర్ ఖాదర్ భాషను తిరుపతి జిల్లా ముస్లిం మైనార్టీ విభాగం అయ్యారు.

## టిడిపి శ్రేణులతో రాజకీయ పరిణామాలపై మాలేపాటి చర్చలు



**కావలి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** టిడిపి కావలి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానా యుడు గురువారం కావలి టిడిపి కార్యాలయంలో టిడిపి శ్రేణులతో రాజకీయ పరిణామాలపై చర్చలు జరిపారు. పార్టీ కోసం ఆయన చేసిన అభివృద్ధి, తదితర విషయాలపై మాలేపాటి చర్చించారు. కావలి పట్టణ, రూరల్ మండల నాయకులు పాల్గొన్నారు.

## మత్తు పదార్ధాలను నిర్మూలిద్దాం.. ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దాం




**నెల్లూరు టౌన్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** జమాత్ ఎ ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మత్తు పదార్ధాలను నిర్మూలిద్దాం ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దాం అన అంశంతో ఫిబ్రవరి 8 నుండి ఫిబ్రవరి 18 వరకు రాష్ట్రస్థాయి యాంటి డ్రగ్స్ ఉద్యమం నిర్వహిస్తుందని జమాత్ ఎ ఇస్లామి హింద్ నెల్లూరు నగర శాఖ ఉపాధ్యక్షులు జనాబ్ అబుల్ హసన్ తెలిపారు. నెల్లూరు నగరంలోని జమాతే ఎ ఇస్లామి హింద్ నెల్లూరు శాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ ఉద్యమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కలవడం, డ్రగ్స్ కు బానిసలై వారిని గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇప్పించడం, అవసరమైన వారికి పునరావాస కేంద్రాలకు నిర్ధేశించడం, కౌన్సిలింగ్ సెంటర్లను ఏర్పాటు చేయడం వంటి విభిన్న కార్యక్రమాలు చేపట్టనున్నామని చెప్పారు. డ్రగ్స్ మహమ్మారి మన సమాజాన్ని కబళించి వేస్తుందని ముఖ్యంగా విద్యార్థులు, యువకల జీవితాలు సర్వనాశనం అవుతాయని, దీని నుంచి యువకులను రక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సిరాజ్, ఖయ్యాం భాషా, సందాని, అబ్దు స్సమి, కార్యకర్తలు నవీద్, సాజిద్, షాహిర్, అయాజ్, మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## జనసేనాని పవన్‌కళ్యాణ్‌ను కలిసిన కాశీరావు



**ఉదయగిరి, ఫిబ్రవరి8, ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గ జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు కాశీరావు మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసేనాని పవన్‌కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ పొత్తుల కలియికపై ప్రజలయొక్క స్పందన ఎలా ఉంది అనే అంశాలపై అధినేత పవన్‌కళ్యాణ్‌తో చర్చించినట్లు ఆయన తెలిపారు. తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ కలయికలో రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కూటమి కచ్చితంగా అధికారంలోకి వస్తుందని, జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో పోటీచేయబోతున్న స్థానాల్లో కచ్చితంగా తమ పార్టీ గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఉదయగిరి నియోజకవర్గంలోని జనసేన పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు నిర్వహిస్తామని, అందుకు అనుగుణంగాతమ కార్యచరణను రూపొందించుకుని ముందుకు సాగుతామని ఆయన తెలిపారు.

## బోగోలు డిప్యూటీ తహశీల్దార్ బదిలీ

**బిట్రగుంట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** బోగోలు మండల డిప్యూటీ తహశీల్దార్ జి.వెంకటేశ్వర్లు ఎఎస్‌పేట మండల డిప్యూటీ తహశీల్దార్‌గా బదిలీ అయినట్లు తహశీల్దార్ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. ఆయన స్థానంలో కావలి తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న జులుయాబాయిని ఇక్కడికి బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు పంపారు.

## కోవూరుపల్లిలో ఇందుపూరు కుటుంబాన్ని పరామర్శించిన కావ్య కృష్ణారెడ్డి




**బిట్రగుంట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** బోగోలు మండలం కోవూరుపల్లి గ్రామంలో గురువారం మండల టిడిపి మాజీ అధ్యక్షులు ఇందుపూరు ధనుంజయరెడ్డి కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఉత్తరక్రియలలో కావలి టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు. విష్ణువర్ధన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులతో ఆయన మాట్లాడారు. ప్రతి టిడిపి నాయకులు, కార్యకర్తలకు ఆపద సమయంలో తాను అండగా వుంటానని విష్ణువర్ధన్‌రెడ్డి అకాల మరణానికి తాను చింతిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట మండల టిడిపి అధ్యక్షులు యం.నాగేశ్వరరావు, కార్యదర్శి ఎల్.సుధీర్‌బాబు, పార్టీ ముఖ్యనాయకులు రఘురామనాయుడు, మాధవరావు, నాటకరాణి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. మాలేపాటి సుబ్బానాయుడు పరామర్శ...కోవూరుపల్లి గ్రామంలో గురువారం జరిగిన ఇందుపూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఉత్తరక్రియలలో నియోజకవర్గపు మాజీ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

## బుద్ధవిహార్‌లో ఘనంగా రమాబాయి జయంతి వేడుకలు



**కావలి రూరల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీమ్‌రావు అంబేద్కర్ సతీమణి రమాబాయి జయంతి వేడుకలు కావలి పట్టణం అంబేద్కర్‌నగర్‌లోని బుద్ధవిహార్ నందు ఘనంగా జరిగాయి. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం అంబేద్కర్‌వాది జయప్రకాష్ మాట్లాడుతూ రమాబాయి జీవితం మహిళలకు ఆదర్శప్రాయమని, ప్రతి ఒక్క మహిళ ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. తదనంతరం ఎస్ఐగా సెలెక్ట్ అయిన స్రవంతిని దుశ్శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బుద్ధవిహార్ సభ్యులు, రమాబాయి సంస్థ సభ్యులు, జనప్రకాషిణి సభ్యులు, బిటిఎ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ సొసైటీ చైర్మన్‌కు ఘన నివాళులు



**కోవూరు, ఫిబ్రవరి8 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు సహకార సొసైటీ మాజీ చైర్మన్ వేమారెడ్డి శైలేంద్రరెడ్డి ఇటీవల మృతిచెందారు. గురువారం ఆయన చిత్రపటానికి కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి సోదరుడు వేమారెడ్డి వినీత్‌రెడ్డిని ఓదార్చి తన సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం తగదు



**కోవూరు, ఫిబ్రవరి8 ప్రభాతవార్త :** పశు సంవర్ధక శాఖలో పశు సహాయకులుగా బాధ్యతలు స్వీకరించిన ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం చూపకుండా తమకు ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించేలా చూడాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పశు వైద్యశాల కార్యాలయంలో గురువారం వివిధ మండలాల నుంచి ఐదు మంది పశు సహాయకులు కోవూరు మండలంలోని రైతు భరోసా కేంద్రాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన శాఖా పరంగా పలు విషయాలపై పశు సహాయకులకు అవగాహన కల్పించారు. పశు సహాయకులు వారి వారి రైతుభరోసా కేంద్రాల పరిధిలో పాడి రైతులు ఎంతమంది ఉన్నారు.. ఎన్ని పశువులు ఉన్నాయి.. వారికి సీజన్‌లో వేయాల్సిన టీకాలు వేశారా.. అనే విషయాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. ముఖ్యంగా పాడి రైతులకు ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ద్వారా అందించే పథకాలపై అవగాహన కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ సజ్జాద్, పశు సహాయకులు ఉన్నారు.

## ప్రాథమిక దశ నుంచి వ్యాయామం పట్ల ప్రత్యేక దృష్టి



**కోవూరు, ఫిబ్రవరి8 ప్రభాతవార్త :** ప్రాథమిక దశ నుంచి ప్రతి విద్యార్థి వ్యాయామం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని ఫిజికల్ డైరెక్టర్ దేవిక సూచించారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గురువారం విద్యార్థులకు వ్యాయామం, దానికి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాయామం అనేది దేహ దారుఢ్యాన్ని పెంచడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని కూడా కలిగిస్తాయన్నారు. విద్యార్థిలో బెరుకుతనం పోయి చురుకుతనం వస్తుందన్నారు. అదేవిధంగా ప్రతి విద్యార్థి వారికి నచ్చిన క్రీడలపై కూడా దృష్టి సారించాలని ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ వెంకటసుబ్బమ్మ, తదితరులు ఉన్నారు.

## వైభవంగా అభిషేక పూజలు



**కోవూరు, ఫిబ్రవరి8 ప్రభావార్త :** కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న షిరిడీ సాయి మందిరంలో గురువారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను కనులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా కోనేటికయ్యలుకు చెందిన వాసు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పచ్చిపాల సుజాత, ధర్మకర్తలు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, భక్తులు ఉన్నారు.

## ఎంపిడివో కార్యాలయంలోని పాత భవనంలో అగ్నిప్రమాదం



**ఉదయగిరి, ఫిబ్రవరి8, ప్రభాతవార్త :** ఉదయగిరి మండలంలోని ఎంపిడివో కార్యాలయ ఆవరణంలో గల పాత సామా గ్రిని భద్రపరిచే భవనంలో కొంతమంది ఆకతాయిలు సామాగ్రికి నిప్పుపెట్టారు .గమనించిన స్థానికులు వెంటనే ఫైరు ఇంజన్‌కి సమాచారం అందించగా ఫైర్ డిపార్ట్‌మెంట్‌వారు వచ్చి మంటలను అదుపుచేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ గత కొన్నిరోజులుగా ఆకతాయిలు చేస్తున్న చేష్టలవలన ఉదయగిరిలో తరుచూ అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు గమనించి ఇలాంటి ఆకతాయి పనులు చేసే వారికి కట్టడి చేయాలని కోరారు. సంఘటనపై ఎంపిడివో డి.ఈశ్వరమ్మ మాట్లాడుతూ అగ్నిప్రమాదం జరిగిన భవనంలో ఎంపిడివో కార్యాలయానికి సంబంధంచిన పాత టేబుల్స్, కుర్చీలు, చెక్క బల్లలు ఉన్నాయని, అవి అన్నీ అగ్నిప్రమాదంలో కాలిపోయాయని తెలిపారు. గత కొన్ని రోజుల క్రితం ఉదయగిరి ఉన్నతపాఠశాలలోని ఒకగదికి ఇదే విధంగా ఆకతాయిలు నిప్పు పెట్టగా వెంటనే స్పందించిన స్థానికులు అక్కడ ఉన్న నీటిని ఉపయోగించి మంటలను అదుపు చేశారు. ఈ రకమైన వరుస ఘటనలు స్థానిక ప్రజలకు కలవర పెడుతుండగా అధికారులు కఠిన చర్యలు చేపట్టి రాబోయే రోజుల్లో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

## దివ్యాంగుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలి



**ఉదయగిరి, ఫిబ్రవరి8, ప్రభాతవార్త :** మండలకేంద్రమైన ఉదయగిరిలోని ఎంపిడివో కార్యాలయ ఆవరణలో సక్షమ్ సంస్థకు చెందిన దివ్యాంగులు ధర్నా నిర్వహించి తమ ఆందోళనను తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో సక్షమ్ అధ్యక్షుడు ఆదోని రమణయ్య మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని అనుకున్నప్పుడు ఆర్థిక పరమైన సహాయ సహకారాలకి తాను ఉన్నానని భరోసా ఇచ్చి అన్ని తానై ఉదయగిరి నియోజకవర్గ బిజెపి నాయకులు ముడమాల రమేష్‌రెడ్డి నడిపించారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వచ్చిన ముడమాల రమేష్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాగుంలపట్ల ప్రభుత్వం చూపిస్తున్న పక్షపాత ధోరణి మంచిదికాదని, ప్రతి సంవత్సరం డిసెంబర్ 3వ తేదీ దివ్యాంగులకు భరోసానిస్తూ గత ప్రభుత్వాలు మంచి కార్యక్రమాలు చేపట్టాయన్నారు. కానీ వైసీపీ ప్రభుత్వం దివ్యాంగులపట్ల ఎలాంటి ప్రత్యేకమైన శ్రద్ధ చూపకపోగా 3వేల పెన్షన్ కొనసాగిస్తూ, సాధారణ వ్యక్తులకు ఇచ్చే పెన్షన్ అమలు చేయడం సరికాదన్నారు. వారికి ఇచ్చే బస్సు పాస్, ట్రైసైకిల్ లాంటి విషయాల్లో ప్రభుత్వం మరింత చోరవతీసుకుని వారికి వెసులుబాటుగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే రోజుల్లో దివ్యాంగులకు ఎలాంటి సహాయసహకారాలు కావాలన్నా ఆర్థిక పరమైన సహాయం కావాలన్నా తాను బిజెపి పార్టీ తరుపున ఎప్పుడూ ముందుంటానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రోశయ్య, ఉదయగిరి మండల పరిసరప్రాంతాల సక్షమ్ సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బుడమగుంట కాలనీలో వ్యభిచార గృహంపై దాడి

**కావలి రూరల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** కావలి మున్సిపాల్టీ పరిధిలోని బుడమగుంట కాలనీలో వ్యభిచారం జరుగుతున్నట్లు సమాచారం రావడంతో కావలి రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కె.శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడులలో వ్యభిచారం నిర్వహిస్తున్న మహిళను, విక్టమ్ మహిళను, ఇద్దరు విటులను పట్టుకుని వారి వద్ద నుండి 2 వేల రూపాయల నగదు, నిరోద్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## తెలుగుదేశం పార్టీకి బీసీలే కొండంత బలం



**ఉదయగిరి, ఫిబ్రవరి8, ప్రభాతవార్త :** మండలకేంద్రమైన ఉదయగిరి చంచల్‌బాబు యాదవ్ అతిధి గృహంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చంచల్‌బాబుయాదవ్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధిక ఓటుశాతం కలిగిన బీసీ నాయకుడినైన నాకు నెల్లూరు తెలుగుదేశంపార్టీ పార్లమెంట్‌స్థానాన్ని కేటాయించాలని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారాచంద్రబాబునాయుడికి మూడుసార్లు విన్నపం చేసినట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీకి బీసీల ఓటు బ్యాంక్ కొండంత అండగా ఉందని రాబోయే ఎన్నికల్లో బీసీ, ఉపకులాల ఓటుబ్యాంకుతో తెలుగుదేశం పార్టీ అత్యధిక మెజారిటీతో అధికారంలోకి రావడం ఖాయమని తేల్చి చెప్పారు. అంతే కాకుండా రాష్ట్రంలోని వైసీపీ పాలన వల్ల ప్రజలు, అధికారులు, అంగన్వాడీలు, ఆశావర్కల్లు ఇలా ప్రతి ఒక్కరూ తీవ్ర ఇబ్బందులకు గురిఅవుతున్నారని రాబోయే ఎన్నికల్లో ఉద్యోగస్తులు ఎవ్వరూ కూడా జగన్మోహన్‌రెడ్డికి ఓటువేసే పరిస్థితి లేదని ఆయన అన్నారు. సుదీర్ఘ కాలంగా పార్టీని నమ్ముకుని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉంటూ ఉన్న తనకు అధిష్టానం ఎంపీ స్థానాన్ని ఖరారు చేయాలని ఆయన మరోసారి ప్రచార మాధ్యమాలద్వారా అధిష్టానానికి విన్నవించుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి మండల టిడిపి కన్వీనర్ చింతనబోయిన బయన్న యాదవ్, ఎలిసి రమణారెడ్డి, సుమన్, అంబటి మస్తాన్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్

**కావలి రూరల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** కావలి కోఆపరేటివ్ కాలనీలోని ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉదయం 9 గంటలకు చెన్నై బేసేడ్ కంప్యూటర్స్ ఇవోఎస్ గ్లోబల్ వారి ద్వారా 2019-24 సంవత్సర విద్యార్థులకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ జరుగుతాయని కళాశాల కరస్పాండెంట్ గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, ప్రిన్సిపాల్ టి.ఉమలు తెలిపారు. విద్యార్థులు వచ్చేటప్పుడు రెస్యూమ్ తీసుకురావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## తమశీల్దార్ నెహ్రూబాబును సన్మానించిన వైసీపీ నాయకులు



**ఉదయగిరి, ఫిబ్రవరి8, ప్రభాతవార్త :** ఉదయగిరి మండలంలోని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్ నెహ్రూబాబును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయగిరిలోని రెవెన్యూ సమస్యలను రాబోయే ఎన్నికలను ప్రశాంతంగా జరపగల నైపుణ్యం ఉన్న అధికారి నెహ్రూబాబు అని తెలిపారు. ఓటర్ల జాబితాలో తప్పుఒప్పులు సరిదిద్దుకునే అవకాశం మరళా ఎన్నికల కమీషన్ కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. మర్యాదపూర్వకంగా తహశీల్దార్‌ను కలిసిన నాయకులు ఆయనను శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి సర్పంచ్ ఎస్‌దాని, ఉపసర్పంచ్ ముర్తుజా, వక్స్ బోర్డు జిల్లా అధ్యక్షలు గడియాల్సి ఎస్‌దాని, వైసీపీ నాయకులు అక్కులురెడ్డి, ఉప్పుటూరి హరి, ఉప్పుటూరి శ్రీను, వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కోవూరులో బరిలో నేనే టిడిపి అభ్యర్థి : పోలంరెడ్డి దినేష్‌రెడ్డి



**బుచ్చి ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గంలో విజయం నాదే, టిడిపి అభ్యర్థి నేనే అని టిడిపి ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలో ప్రతి అడుగు ప్రజలకోసం కార్యక్రమంలో ఆయన చెన్నూరురోడ్డులో వ్యాపారస్తులతో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు కోవూరు నియోజకవర్గం టిడిపి అభ్యర్దినేనే అని పోలంరెడ్డి దినేష్‌రెడ్డి స్పష్టం చేశారు. కొంతమంది వైసిపి నాయకులు, నేనంటే గిట్టని వారు అభ్యర్దిని మారుస్తున్నారంటు దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబునాయుడు నాకు భరోసా ఇచ్చి కోవూరు నియోజకవర్గం నేనే అని చెప్పడం జరిగిందని అన్నారు. వైసిపి పేటిఎం బ్యాచ్‌లు ఎన్ని దుష్ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మరని అన్నారు. కోవూరు నియోజకవర్గం టిడిపి అభ్యర్ది ముమ్మాటికి నేనే అని ఆయన స్దానిక విలేఖర్ల వద్ద స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆర్దిక శాఖామంత్రి బుగ్గన రాజేంద్రనాద్‌రెడ్డి ప్రవేశపెట్టిన బడ్జెట్ పేక్ బడ్జెట్ అని ఆయన తీవ్రంగా విమర్శించారు. గతంలో నాలుగు బడ్జెట్‌లలో 25 శాతం కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. పరిశ్రమల అభివృద్ది ఎక్కడ లేదని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అద్బుతమైన బడ్జెట్ ప్రవేశపెడతామని అన్నారు. మానాన్న పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ది చేశారు. ఆయన ఆశీస్సులు నాకున్నాయి. చంద్రబాబునాయుడికి కోవూరు నియోజకవర్గంలో గెలిచి చూపించబోతున్నానని అన్నారు.. టిడిపి నాయకులు ఎక్కడికి వెళ్లినా బ్రహ్మారధం పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి చెముకుల కృష్ణ చైతన్య మండలపార్టీ అద్యక్షులు ఎం.వి శేషయ్య, జిల్లా బిసి సంఘం నాయకులు బత్తలహరికృష్ణా, వింజం రామానాయుడు, తాళ్ల నరసింహస్వామి, దుగ్గిశెట్టి హరినాద్, దశరద్‌కుమార్, 12 వవార్డు ఇన్‌చార్జి సొల్లేటి ప్రభాకర్, మైనార్టీనాయకులు బచ్చాభాయి, సర్దార్, ఎండి .మొహుద్దీన్, వింజం మహేష్‌నాయుడు, కౌన్సిలర్ జూగుంట కళ్యాణ్, వల్లూరు శ్రీనివాసులు , వెంకటేశ్వర్లురెడ్డి , మహిళా నాయకురాలు కె. మంజుల పలువురు టిడిపినాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## ప్రజల్లో వున్న సైలెంట్ విప్లవమే కాంగ్రెస్‌కు అధికారం




**కావలి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజల సైలెంట్ విప్లవానికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందన్న సంకేతాలు వున్నాయని కాంగ్రెస్ పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్, ప్రముఖ న్యాయవాది చింతాల వెంకట్రావు తెలిపారు. తెలంగాణా రాష్ట్రంలో మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రజలు కాంగ్రెస్‌కు పట్టంకట్టేందుకు సిద్దంగా వున్నారని తెలిపారు. కావలి పట్టణ రైల్వే రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలపడుతుందని తెలిపారు. రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో నూతన పదవులు పొందిన రాష్ట్ర అధికార ప్రతినిధిగా లేళ్ళపల్లి సురేష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి అనుమాలశెట్టి వాసు, కావలి పట్టణ అధ్యక్షులు పొదలకూరు కళ్యాణ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు మానసలకు నియామక పత్రాలు అందజేసి వారిని చింతాల వెంకట్రావు సత్కరించి అభినందించారు. ప్రజలు మళ్లీ కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెచ్చి సహకరించాలన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి లేళ్ళపల్లి సురేష్‌బాబు, పట్టణ అధ్యక్షులు పొదలకూరు కళ్యాణ్‌లు మాట్లాడారు. మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలన్నా, విద్యార్థులకు ఉద్యోగాలు రావాలన్నా, సామాన్యులు స్వేచ్ఛగా వుండాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. సోనియాగాంధీ నాయకత్వంలో రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ సూచనలతో రాష్ట్ర పిసిసి అధ్యక్షురాలు షర్మిలారెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ రానున్న ఎన్నికలలో ప్రభంజనం సృష్టిస్తుందన్నారు. 1978లో ఇందిరా కాంగ్రెస్, స్వర్గీయ ఇందిరాగాంధీ నాయకత్వంలో కోట్ల రూపాయలు వున్న వారందరూ ఒక వైపు వున్నా సైలెంట్ ఓటింగ్‌తో ఆనాడు కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిందని తెలిపారు. ఇప్పుడు కూడా ఈ రాష్ట్రంలో ఈ పరిస్థితి వుందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసేందుకు సిద్దంగా వున్నారన్నారు. నూతనంగా పదవులు పొందిన సురేష్, వాసు, కళ్యాణ్, మానసలు కాంగ్రెస్ పార్టీకి ధన్యవాదాలు తెలిపారు. పార్టీకి అంకితభావంతో పనిచేస్తామన్నారు.

## ఓటర్ల లిస్ట్‌పై అభ్యంతరాలు ఉంటే తెలుపవచ్చు



**కోవూరు, ఫిబ్రవరి8 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గానికి సంబంధించి 2024 తుది ఓటర్ల జాబితాను ఇటీవల అధికారికంగా ప్రకటించడం జరిగిందని , ఈ జాబితాలో ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే వాటిని పక్కాగా సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ , కోవూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం. శ్రీనివాసులు అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అన్ని రాజకీయ పార్టీ నాయకులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువకులు ఇంకా ఎవరైనా ఓటర్లుగా నమోదు చేసుకోకపోతే అటువంటి వారు ప్రస్తుతం ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ ఓటు నమోదు అనేది నిరంతర ప్రక్రియ అన్నారు. కుటుంబ సభ్యులందరినీ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో వచ్చేలా లిస్ట్‌లో తగు జాగ్రత్తలు తీసుకోవడం కూడా జరిగిందన్నారు. ఈ జాబితాను రాజకీయ పార్టీలు పరిశీలించి ఇంకా ఏమైనా అందులో తప్పు ఒప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయశ్రీ , మండల ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మధు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఉన్నారు.

## పరీక్షల పట్ల ఆందోళన తగదు



**కోవూరు, ఫిబ్రవరి8 ప్రభాతవార్త :** పదవ తరగతి పరీక్షలు అనేవి విదార్థుల జీవితంలో అత్యంత కీలకమని, ఈ దశలో విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యక్తిత్వ వికాస నిపుణులు కోదండరామయ్య అన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సమావేశ మందిరంలో గురువారం పదవ తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే అంశాలను పూర్తిగా ఆకళింపు చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పరీక్షల పట్ల బెరుకుతనం, ఆందోళనలను పక్కన పెట్టి ఇచ్చిన ప్రశ్నా పత్రాలను ఒకటికి రెండు సార్లు చదువుకోవాలని ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు సూచించారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు సూచించారు. పరీక్షలకు ఇక కొద్ది సమయమే ఉందని, ఈ సమయంలో టీవీలు, సెల్‌ఫోన్లు పక్కనపెట్టి కేవలం పుస్తకాల పైనే దృష్టి పెడితే విజయం మీ చెంతనే ఉంటుందన్నారు. ఇంకా ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహామూర్తి పలు సూచనలు చేశారు. అనంతరం కోదండరామయ్యను శాలువా, బొకేతో ఘనంగా సత్కరించి సన్మానం చేశారు.

## ఉలవపాడు స్టేషన్‌ను తనిఖీ చేసిన డిఎస్పీ శ్రీనివాస్



**ఉలవపాడు,ఫిబ్రవరి8,ప్రభాతవార్త :** ఉలవపాడు పోలీస్‌స్టేషన్‌ను డిఎస్పీ శ్రీనివాస్ గురువారం తనిఖీ చేశారు. డిఎస్పీ రాకతో పోలీస్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన స్టేషన్ ఆవరణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం పలు రికార్డులు పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సాధరణ తనిఖీల్లో భాగంగా కందుకూరు సర్కిల్లోని పోలీస్‌స్టేషన్లు ఎలా ఉన్నాయని తెలుసుకునే భాగంగా ఉలవపాడు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రైటర్ కె.శ్రీనివాసులు, పి.శ్రీనివాసులు, కె.బ్రహ్మయ్య, రషీద్,రిజ్వాన్,తిరుపతిస్వామి,నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ ఆదాలకు ప్రత్యేక కృతజ్ఞతలు-



**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** నెల్లూరు పార్లమెంటు సభ్యులు, రూరల్ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక కృషితో ఏపీ స్టేట్ ఎంఎస్‌ఎంఈ డైరక్టర్‌గా నియమితులైన సందర్భంగా గురువారం సాయంత్రం ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కార్యాయంలో రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ డైరక్టర్ పదవి వచ్చేందుకు అన్ని విధాల సంపూర్ణ సహకారాలు అందించిన నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డికి, పాశం శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఎంఎస్‌ఎంఈ డైరక్టర్, విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ డైరక్టర్ పదవి బాధ్యతలు చేపట్టిన పాశం శ్రీనివాస్‌ను విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ డైరక్టర్‌గా నియమితులైన పాశం శ్రీనివాస్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షులు సన్నపురెడ్డి పెంచల్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు మల్లు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర వైసీపీ బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ సీహెచ్ హరిబాబు యాదవ్, శ్రీ ఇరుకలల పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ రావు శ్రీనివారావు, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం చైర్మన్ గూడంశెట్టి దొరబాబు, జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి వేలూరు శివ సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రచారకర్తల నియామకం



**నెల్లూరు ఫిబ్రవరి 8, ప్రభాతవార్త-వైద్యం :** రూరల్ నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీల కూటమి గెలుపుకి మద్ధతుగా ప్రచారం చేసేందుకు, ప్రచారకర్తల నియామాలను సమావేశాన్ని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నిర్వహించాడు. ఈ సందర్భంగా ఎన్నికలు అతిత్వరలో రాబోతున్నాయని, ఏక్షణంలో ఎన్నికల నోటిఫికేషన్ రాబోతుందన్నాడు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రచారకర్తలు విస్తృతంగా ప్రజల్లోకి వెళ్ళి, ఎక్కడికక్కడ ఆత్మీయ సమావేశాలు ఏర్పాటుచేసుకుని ప్రజలతో మమేకం అవ్వాలని సూచించాడు. ప్రచారానికి మద్ధతుగా ఉంటామని, వారందరికీ కూడా ఎక్కడికక్కడ బాధ్యతలు అప్పగిస్తానని శ్రీధర్‌రెడ్డి చెప్పాడు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జన్ని రమణయ్య, జిల్లా అధికార ప్రతినిధి పఠాన్‌హ సాబిర్‌ఖాన్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, షంషుద్దీన్, శైలేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# అందరి దృష్టి సర్వేపల్లి వైపే.. - వేడెక్కుతున్న రాజకీయాలు

**మనుబోలు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** ఎన్నికలు ముంచుకొస్తుండటంతో సర్వేపల్లి నియోజకవర్గంపైనే అందరి దృష్టి మళ్ళుతుంది. ఎన్నికల కోడ్ రాకముందే రాజకీయం గరంగరంగా మారుతుంది. సర్వేపల్లి నియోజకవర్గంలో సరైన అభ్యర్థులు ఉండటంతో జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర బిందువుగా మారింది. ముఖ్యంగా వైకాపా అభ్యర్థి, రాష్ట్ర మంత్రి వర్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆయన పోటీ అభ్యర్ధి టీడీపీ మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కావడంతో ఇక్కడ రాజకీయాలకు ప్రాధాన్యత పెరిగింది. ఫలితంగా ప్రతినిత్యం నియోజకవర్గ వ్యాప్తంగా పల్లెల్లో వీళ్లిద్దరి గెలుపోటములపై చర్చ జరుగుతుంది. గ్రామాల్లో ఎవరు గెలుస్తారనే సర్వేలు మొదలయ్యాయి. టీడీపీ, జనసేన పొత్తుపై ఈ సారి కాకాణికి గట్టి పోటీ ఎదురు కానుంది. కాకాణి గోవర్ధన్‌రెడ్డి నియోజకవర్గంలో గట్టి వర్గాన్ని సంపాదించి పల్లెల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని భాగా సద్వినియోగం చేసుకున్నాడు. ఈసారి మంచి మెజార్టీతో తానే గెలుస్తానని కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధీమాగా ఉండటమే కాకుండా ఆయన అనుచరులు కూడా తమ నేతతో విజయం అని బాహాటంగా చెప్పున్నారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈసారి కాకాణిని ఎలాగైనా ఓడించాలని అల్లీపురం నుండి నెల్లూరు టౌన్‌లోని గాంధీనగర్‌కు మకాం మార్చారు. తాను తరచు ఓటమి పాలు కావడం, ఇల్లు కలసి రాకపోవడమే కారణమేనని కాబోలు నెల్లూరు టౌన్‌లోకి ఇటీవల నివాసం మార్చాడు. ఈ ఫలితం పార్టీ నాయకులు, కార్యకర్తలకు తరచు అందుబాటులో ఉంటూ సౌకర్యంగా మార్చుకున్నాడు. కాకాణి గోవర్ధన్ రెడ్డి నివాసానికి మాజీ మంత్రి చంద్రమోహన్‌రెడ్డి నివాసం దగ్గర కావడం విశేషం. సర్వేపల్లి నియోజకవర్గంలో ఎక్కడ చూసిన వీళ్లిద్దరి గెలుపోటములపై చర్చ సాగుతుంది. ఎన్నికల కోడ్ రానున్నడంతో అందరూ అన్ని పార్టీల నాయకులు సిద్ధంగా ఉన్నారు.

# నేడు డీ వార్మింగ్ డే ను విజయవంతం చేయండి

**నెల్లూరు అర్బన్,ఫిబ్రవరి8,ప్రభాతవార్త :** చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు జిల్లా వ్యాప్తంగా నేడు(9వ తేదీన) జాతీయ నులిపురుగుల నిర్మూలన( డీ వార్మింగ్ డే) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా వైద్యాఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరినారాయణన్ అధికారులకు ప్రత్యేకంగా దిశానిర్ధేశం చేశారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో నేడు అల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు అందించేందుకు ఏర్పాటు చేశారు.సుమారు 7వేల కేంద్రాల్లో ఈ మాత్రలు పంపిణీ జరగనుంది.

నులిపురుగుల మాత్రల ఉపయోగాలు.నులిపురుగులు సోకిన చిన్నారులు ,కిశోరబాలల్లో రక్తహీనత, పోషకాల లోపం,ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరోచ నాలు,బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.వీటిని అధిగమించేందుకు అల్బెం డజోల్ మాత్రను నమిలి చప్పరించాలి.

**ఎలా వాడుకోవాలి.** .1-19మధ్యవయస్సుగల చిన్నారులు,కిశోరబాలలకు ఎన్నో అనారోగ్య ప్రయోజనాలు కలింగించే అల్బెండజోల్ నులిపురుగల మాత్రలు తప్పనిసరిగా అవగాహనతో తీసుకునేలా చూడాలి.ప్రతిఒక్కరికీ ఈ మాత్రలు అందించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని,రెండేళ్లలోపు పిల్లలకు ఇంటివద్దకే వెళ్లి అంగన్వాడీ కార్యకర్త,ఏఎన్ఎంలు,అవగాహనతో మాత్రలు తీసుకునేలా చూడాలి.ఈ కార్యక్రమాన్ని నూరుశాతం విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# జిల్లాలో ఆర్ఎస్‌డీటీలు,డీటీలు బదిలీ

**నెల్లూరు అర్బన్,ఫిబ్రవరి8,ప్రభాతవార్త :** జిల్లాలోని పలు తహశీల్దార్లు,రీసర్వే డిప్యూటీ తహశీల్దార్లు బదిలీలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుతం చేస్తున్న తహశీల్దార్లు ,ఆర్ఎస్‌లు,డిటిలను పలు మండలాలకి బదిలీ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వారందరికీ మండలాలు కేటాయించారు. బదిలీ అయిన అధికారులు శుక్రవారం కొత్త పోస్టుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటికే తహశీల్దార్లను బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం డీటీలను బదిలీ చేశారు.

# ఉద్యోగ,ఉపాధ్యాయులకు ఏఏఎస్‌ను వర్తింపజేయండి



**నెల్లూరు,ఫిబ్రవరి8 ప్రభాతవార్త-విద్య :** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు డాపార్ట్మెంట్ పరీక్షలతో నిమిత్తం లేకుండా అడ్వాన్స్మెంట్ స్కీం(ఏఏఎస్)ను వర్తింపచేయ్యాలని తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. గురువారం శాసనమండలి సమావేశాల్లో పాల్గొన్న ఆయన ఈమేరకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులకు మేలు చేసే విధంగా అన్నీ చర్యలు తీసుకున్న ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.ప్రభత్వు ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు రాని పక్షంలో వారికి ఏఏఎస్ వర్తింపచేసి ఇం క్రిమెంట్ కల్పించాలన్నారు. 24 సంవత్సరాలకు మెదటిస్థాయి, 45 సంవత్స రాలకు రెండవస్థాయి, 50 సంవత్సరాలు దాటిన వారికి మూడవ స్థాయి దాటిన వారికి పదోన్నతులు ప్రభుత్వం కల్పించటం అభినందనీయమన్నారు. ఏఏఎస్‌ను వర్తింపచేయటం ద్వారా వేలమంది ఉపాధ్యా యులకు మేలు చేకూరుతుందని ఆయన స ్పష్టంచేశారు.

# పగడ్బందీగా ప్రయోగపరీక్షలు నిర్వహించాలంటూ వినతి

**నెల్లూరు,ఫిబ్రవరి8 ప్రభాతవార్త-విద్య :** ఈనెల 11నుండి జిల్లా లో నిర్వహించనున్న ఇంటర్ ప్రయోగపరీక్షలకు పగడ్బందీగా నిర్వహించాలనికోరూతు ఆంధ్రప్రధేశ్ విద్యార్థి జేఏసీ నాయకులు ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఏ.శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఆదిత్యసాయి మాట్లాడుతు ప్రయోగ పరీక్షలు ఇంటర్ విద్యలో ఎంతో కీలకమని, అయితే జిల్లాలోని అనేక ప్రయివేట్ కళాశాలల్లో ప్రయోగ పరీక్షలు పూర్తిస్థాయిలో నిర్వహించలేదని ఆరోపించారు. ఈ ఏడాది సెల్ఫ్ సెంటర్స్ కనుక అనేక యాజమాన్యాలు మార్కుల పేరతో విద్యార్థులనుండి అదనపు సొమ్మును వసూళ్ళుచేయటం జరిగిందన్నారు. ఇటువంటి అవకతవకలను అన్నీ ఇంటర్ బోర్డు అధికారులు దృష్టిలో ఉంచుకుని స్క్వాడ్స్‌ను పెంచాలని కోరారు. చూచి రాతలు లేకుండా ప్రశాతంగంగా పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు గోపి, శ్రీకాంత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# పెచ్చులు ఊడిపడ్డ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్‌డిఒ

**సంగం ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** సంగంలోని స్థానిక సచివాలయంలో జరుగుతున్న జగనన్న ఇళ్ళ స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆర్‌డిఒ మధులత పరిశీలించారు. రిజిస్ట్రేషన్ జరుగుతున్న తీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇళ్ళ స్థలాల రిజిస్ట్రేషన్ జరుగుతున్న తీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇళ్ళ స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం పల్లిపాళెం గ్రామంలో ఇటీవల స్లాబ్ పెచ్చులు ఊడిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాన్ని పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలోకి మార్చే ఏర్పాటు చేస్తామని తెలిపారు. అదే విధంగా తహసిల్దారు రమాదేవి స్థానిక జడ్‌పి హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో వసతులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఆర్‌ఐ రాజనారాయణ, విఆర్‌ఒలు, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

